# స్నేహ కారణం

సత్యమూర్తి

సాయంత్రం గ్రామసింహంలా గ్రామపర్యటన పూర్తిచేసుకొని యింటి కొచ్చేటప్పటికి శుభలేఖ పట్టుకొని గుమ్మంలోనే ఎదురైంది నా కులకాంత. నే రచయితగా పత్రికాలోకంలో అడుగు పెట్టిన నాటినుంచీ కనీసం రోజుకొక్క ఉత్తరమైనా రావడం పరిపాటి. వాటివల్ల ఏం ఉపయోగం లేదని నాకు దృఢంగా నమ్మకమున్నా యింటికి వచ్చినతక్షణం నాకు ఉత్తరం అందించక పోతే మహాకష్టంగా ఉండేది. నన్ను ఉన్మాదుణ్ణి చేయడం యిష్టంలేక మా యింటావిడ గుమ్మంలోనే ఉత్తరం చేతి కందియ్యడం ప్రారంభించింది. ఆ నిర్మాణ కార్యక్రమం లోనిదే యీ రోజు శుభలేఖ కూడా.

శుభలేఖంటే అచ్చం శుభలేఖ కాదుగాని శుభంతో కూడుకున్న లేఖ. మిల్లు యజమాని ఇంట్లో వివాహానికి భరతనాట్యం కట్టిస్తున్నారు. సదరు నాట్యభంగిమలో ఉన్న ఆనందాది రసాలను గ్రోలే శక్తి ఉందని కాబోలు నాకు ఆహ్వానమంపారు. నా చిరునామాను నేనే వీలైనన్ని సార్లు పారాయణ జేసుకొన్నాను. ఇంతసేపూ మా ఆవిడ నా ముఖలక్షణాలు గమనిస్తూనే ఉంది. ఇంక మౌనాన్ని భరించలేక కాబోలు "ఏమిటండీ శుభలేఖ" అంది. "ఇది శుభలేఖ కాదు" అందామనుకున్నానుగాని కనీసం నాకు ఉన్నంత చత్వారమైనా మా ఆవిడకు లేదు. అందుకని సాహసించలేక పోయాను. శుభలేఖ కాదనిచెప్పవలసినంత అగత్యం ఎందుకొచ్చిందంటే యీ మధ్య ఎన్నికథలు వ్రాసినా పత్రికలలో ప్రకటితం కావడం లేదు. అంచేత సినీమాలకు మొట్టమొదటి రోజునే హాజరై విమర్శలువ్రాసి పంపుతూంటే పత్రికలలో రచయిత పేరు సులువుగా పడుతూంది. అందుకని ఫిలిం రిలీజైన మొదటి రోజునే అతికష్టం మీద నేల టికట్టుకు డబ్బు సంపాదించి ప్రయాణం అవుతూంటే మా ఆవిడ, నేనూ వస్తాననేది. మొట్టమొదటి రోజున తొక్కుడుగా ఉంటుంది. టిక్కెట్లు దొరకవు. తీరా యింతదూరం నడచివెళ్ళి ఉసూరుమని తిరిగి రావాల్సొంటుంది. పైగా యింటి దగ్గర ఎవరూ ఉండరు. రోజులు మంచివి కావు. వగైరా ఆప్తవచనాలు చెప్పినా మా ఆవిడ వినదు. పత్రికా రచయితగా నేను చాల మందిని లాలించి, కవ్వించి, నవ్వించగల్గుతున్నాను. ఈ భుజకీర్తికి కూడా నా సినీమా ప్రయాణం వచ్చేటప్పటికి శక్తి క్షీణించి మా ఆవిడకు లొంగిపోవలసి వస్తూంది. ఈ శుభలేఖ భరతనాట్యానికి ఆహ్వానలేఖ అని చెబితే తనెక్కడ తయారవుతుందోనని భయం. కోర్టు తీర్పుల రూపంలో వాదిస్తే తనే నెగ్గుతుందని నాకు బాగా తెలుసు. సినీమాకు వెళ్ళాలంటే ప్రాథమిక ఆటంకం డబ్బు. ఇక ఆహ్వానం గనుక భరతనాట్యానికి డబ్బవసరం లేదు. భార్య భర్త సుఖదుఃఖాలలో సగభాగిని గనుక ఆర్థిక సమస్యలేని యిలాంటిచోట ఆ సూత్రం బలపడుతుంది. "బలపడుతుంది" అనే భావం నాకు స్ఫురించక మౌనంగా ఉండలేక పోయాను. మా ఆవిడ చూస్తూన్న చూపు అంకుశంలా నన్ను బాధింపజొచ్చింది. "సర్వారాయుడుగారింట్లో పెండ్లి యింది కాదూ, యీరాత్రి భరతనాట్యం జరుగుతుందట. ఆహ్వానమంపారు" అన్నాను తడబడుతూ. "ఊహూఁ!" అని లోపలకు వెళ్ళిపోయింది. ఆమె నడత చూస్తే నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. నేనూ వస్తాను అనలేదు! చెవులు సవరించుకొనే విన్నాను. అయినా మూలిగినట్లు కూడా గుర్తు లేదు. వెనక్కు తిరిగింతరువాత మూలిగి మూతి బిడాయించుకుందేమో అని అనుమానమొచ్చి లోపలకు

వెళ్ళి ముఖలక్షణాలు పరిశీలించాను. శిల్పకారుడిలా దగ్గరనుంచి, దూరంనుంచి, ప్రక్కనుంచి మా ఆవిడ ముఖంలోకి చూశాను. అయినా చికాకుగా లేదు. మామూలుగానే హుషారుగా తిరుగుతూంది. మళ్ళీ ఆలోచనలో పడ్డాను. డబ్బు ఖర్చు లేదుగనుక ఎలాగా తీసుక వెడతానని ధైర్యమేమో? అనుకుని దిగులు పడ్డాను. నేనలా దిగులుతో స్తంభించిపోయి నిలుచుండడం చూచి "లేచి స్నానంచెయ్యండి. భోజనంచేసే వెడతారు కదూ?" అంది. జీవనాడులన్నీ ఒక్కమాటుగా శక్తిని తెచ్చుకున్నాయి. "ఆఁ!" అనగల్గాను. సీత, అహల్య ప్రస్తుత స్త్రీ జనోద్ధరణకు వెగటుజెంది తమ తమ ప్రాతివ్రత్యంలో మా ఆవిడకు వాటా బెట్టేరేమో అనుకొని సంతోషించాను. ఆ సంతోషోద్రేకం నూతిదగ్గర జారిపడడం వగైరా ఫలితాలను కూడా తెచ్చిపెట్టింది.

భోజనంచేసి కూర్చున్నాను. టైమెంతైందో బోధపడింది కాదు. ఆహ్వాన లేఖలో తొమ్మిదిన్నర గంటలకు ప్రారంభమగును. అని మాత్రం వ్రాసుంది. అది మళ్ళీ ఒక్కసారి చూశాను అయినా అంతే ఉంది. పది గంటలకు రైలు కూత వినబడుతుంది. అప్పుడు బయలుదేరి వెళ్ళడం క్రమశిక్షణకు భంగం. అయినా రైలు సరిగ్గా పది గంటలకు వస్తుందని నమ్మకంకూడా లేదు. మా వీథిలో చౌదరిగార్కి గడియారం ఉంది. గుమ్మంలో నిలబడి చూస్తే గడియారం కనబడుతుంది కాని వీథిగుమ్మం తలుపులెప్పుడూ వేసే వుంటాయి. పూర్వం యిలా టైము తెలుసుకోవలసి వచ్చినప్పుడు తలుపు గుద్ది టైము అడిగేవాడిని గాని మొన్న వీరేశలింగం వర్ధంతి సందర్భంలో నాకు ఆహ్వానం వచ్చింది. చౌదరి, సర్వారాయుడు వగైరాలంతా శ్రోతలలో కూర్చొని ఉండగా ఉపన్యాసక పీఠం అలంకరించాను. ఆనాటినుంచీ టైము కోసరం వాళ్ళింటికి వెళ్ళడం చిన్నతనంగా కనుపిస్తోంది నాకు. ఎటొచ్చీ ఎందుకొచ్చావూ? ఎందుకు వెడుతున్నావూ? అని అడగని చోట్లు రెండున్నాయి. పోస్టాఫీసు, రైలుస్టేషను. అందులో మొదటిది సూర్యుడితోటే అస్తమిస్తుంది. ఇక రైలుస్టేషనొక్కటే శరణ్యం. మా ఊరికి రైలు స్టేషను యీ కొసనా, సర్వారాయుడు గారిల్లు ఆ కొసనా ఉన్నాయి. టూ బర్డ్స్ ఎట్ ఎ షాట్ అన్న ఆంగ్లేయ సామెత బుర్ర ఎంత ఆలోచించినా ఆచరణలోనికి వచ్చే మార్గం గోచరించలేదు. అలాగే ఆలోచించుకొంటూ కూర్చున్నాను. భోజనం అప్పుడే చేసి కూర్చున్న మూలాన్ని హాయిగా కునికిపాట్లు వచ్చినై. ఆ కునుకులో ఎంతసేపు గడచిందో నేను చెప్పలేనుగాని లేచి చూచేటప్పటికి నలుగురైదుగురు చుట్టలు కాల్చుకుంటూ బడితె కర్రలు పట్టుకొని కంగారుగా నడచి వెడుతున్నారు. భరతనాట్యంమీదే వాళ్ల సంభాషణ సాగుతోంది. వెంటనే సర్వారాయుడుగారింటికి బయలుదేరాను. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు మా మేష్టారు చెబుతూండేవారు. తెల్లవారుఝామున సరిగ్గా యిన్నిగంటలకు లేవాలని నిశ్చయించుకొని పడుకొంటే సరిగ్గా అన్నిగంటలకే మెళుకువ వస్తుందని. ఇప్పుడాయన జ్ఞప్తికి వచ్చాడు. గడియారం సహాయం లేకుండానే భరతనాట్యం ప్రారంభమయ్యే సమయానికి మేల్కొగల్గాను. మేష్టారి అనుభవయుక్తమైన సలహాకు లోలోన జోహారులర్పించాను. ఆ సమయంలో ఆయన కనిపించినట్లయితే నేను వెళ్ళడం మానుకొని నా ఆహ్వానపత్రం ఆయనకిచ్చి పంపుదామన్నంత అభిమానం పుట్టుకొచ్చింది.

మొట్టమొదట కంగారుగా నడవడం ప్రారంభించాను. గమ్యస్థానం దగ్గరబడే కొలదీ నడక మెల్లగా సాగించాను. కంగారుగా నడుస్తూంటే మర్యాద క్రమక్రమంగా నశిస్తూన్నట్లు అనిపించింది. మత్తగజ గమన లీల కదుల్తూ గమ్యస్థానం చేరుకొన్నాను. అప్పటికప్పుడే కుర్చీలు నిండిపోయాయి. చదునైన నేల కూడా ఆక్రమింపబడింది. పత్రికా రచయిత కూర్చోడానికి అనువైన స్థలం ఎక్కడా గోచరించింది కాదు. ఆహ్వాన పత్రిక చూసైనా నన్ను ముందుకు తీసుక వెడతారని లేఖ చేత్తో పట్టుకొని విసురుకోడం ప్రారంభించాను. ఏమీ లాభం లేకపోయింది. చాలసేపు అట్లా నిల్చుండిపోయాను. తెర లేచింది. అప్పటికి నా వెనకకూడా చాలామంది కూర్చొని ఉన్నారు

నన్ను కూర్చోమని వెనకనుంచి ఆందోళనలు బయలుదేరినాయి. నేను పత్రికా రచయితనని చెబుదామనుకున్నాను గాని వినేట్లు లేదు. “కార్యసాధకుడు ఒకచోట నేలను పవ్వళించును” అన్న భర్తృహరి సుభాషితాన్ని జ్ఞప్తికి తెచ్చుకొని బొత్తిగ కాళ్ళమీద కూర్చున్నాను. “చతికిలబడి కూర్చోవయ్యా!” అన్నాడో పెద్దమనిషి. వెనక్కు తిరిగి చూశాను. అతని వాలకం చూస్తే మాటలతో సమాధానం చెప్తే వినేవాడులా కనబడలేదు. అలా అతనివంక చూస్తూనే చతికిలబడిపోయాను. కాస్త ఆదరణ చెయ్యడానికి శక్తిలేనప్పుడు తగుదునని ఆహ్వానమంపటం దేనికని పెండ్లి యజమానిమీద కొంతసేపు అలిగాను. వెనకనుంచి ఎవరిదో విసనకర్ర తగిలింది నా వీపుకు. ఈయనకూ పెండ్లి యజమానికీ ఏమైనా సంబంధం వుందా అనుకొన్నానుగాని అలాగైతే యిక్కడెందుకు కూర్చుంటాడు? అని ఎర్రగా వెనక్కు చూశాను. “చూడలేదండి విసనకర్ర తగిలింది కాబోలు” అన్నాడాయన. నేను పత్రికా రచయితనని ఆయనకు తెలిసే ఉంటుందని సంతోషించి ఆయనకు దగ్గరగా జరిగాను. ఆయన విసురుకొంటూంటే గాలి నాకూడా తగులుతూంది. అదాయనకు తెలియకుండానే జరుగుతుందని సంతోషించాను. కాని కొంతసేపైన తర్వాత విసనకర్ర నా చేతికిచ్చి విసురుకోమన్నాడు. వద్దులెండని ముక్తసరిగా చెప్పేను. అప్పటికూరుకున్నాడు. మరికొంతసేపు పోనిచ్చి విసనకర్ర చేతికందించబోయాడు. వద్దన్నాను. “అవును విసురుతూంటే హాయిగా ఉంటుంది మరి గాలితగిలి. విసురుకోమంటే చేతులు లాగుతాయి. పోనీ నేనూ విసురుకోడం మానేస్తాను.” అన్నాడు. నేను సిగ్గుపడి పోయాను. ఆయన విసురుకుంటూంటే నాకు గాలి తగులుతుందని తెలిసినందుకు మరీ కించపడ్డాను. ఆయనతో నేనిక మాట్లాడలేదు. ఆయనే నాకు దూరంగా జరిగి కూర్చున్నాడు. భరత నాట్యం చేస్తూంటే ఆ ఒయ్యారం, సొంపూ చూచి “భేష్” అని పైకంటున్నాడాయన. ఈ మాత్రం దానికే “భేష్” అంటున్నాడు కదా! యిక లాలించి, నవ్వించి, కవ్వించే నాకథల మాటేమిటి? అవి యీయనెప్పుడూ చదవలేదనుకుంటాను. అవి చదివితే యిక్కడ “భేష్” అని బొబ్బలెట్ట వలసిన అవసరం ఎక్కడుంది? అది చెబుదామనుకున్నానుగాని కొద్దికాలం క్రితం వివాదపడ్డామని జ్ఞప్తికివచ్చి నాలిక వెనక్కు ముడుచుకొంది. ఆ భావాల్ని పైకివ్యక్త పరుస్తూ నాముఖం వివిధ లక్షణాలను చిత్రించుకొంది. చేతులుకూడ బలపరచినై. అయినా ఆయన గుర్తించలేక పోయాడు. అలాంటి అచేతనులతో నా కేంపనని మాట్లాడ కూరుకొన్నాను. భరత నాట్యం సమాప్తి పొందే సమయానికి ఆయనలేచి వెళ్ళిపోయాడు. కాస్సేపు ఉండి నేనూ వెళ్లిపోయాను.

గోడచాటున దేహబాధ నివారించుకుంటున్నాను. నేను వెళ్ళేటప్పటి కప్పుడే ఆయన బాధ తీర్చుకుని లేచి నిలబడ్డాడు. “భేష్” అన్న భరత నాట్యంలో ఘట్టం జ్ఞప్తికొచ్చింది గాబోలు ఎగరడం ప్రారంభించాడు. నేను నవ్వు సంబాళించుకొని మౌనంగా అట్లానే కూర్చుండి పోయాను. ఆయనలా ఐదు నిముషాల పాటు అభినయం సాగించాడు. ఇంతలో వెధవ పంచె కాళ్ళక్రింద పడింది గాబోలు గుభీమని తూమ్మీద పడ్డాడు. విరోధభావాన్ని విసర్జించి, ఆప్త వచనాలు పల్కుతూ ఆయన దగ్గరకు వెళ్ళేను. సిగ్గుపడి పోయాడు. నుదురు బ్రద్దలైంది. రక్తంకూడా కారుతూంది. ఇంతలో భరత నాట్యంకూడా సమాప్తి అయింది. పదిమందీ మా చుట్టూరా మూగారు. కారణం వారడగనూ లేదు, నేను చెప్పనూ లేదు. ఎవరో ఆయన ఆప్తులు గాబోలువచ్చి నెమ్మదిగా యింటికి తీసుక వెళ్ళేరు. అక్కడ నుంచి ఆయన చాల సార్లు నాకు కనబడుతూండే వాడు. కనబడి నప్పుడల్లా నమస్కారం అంటూండే వాడు. నేనూ చిన్నగా నవ్వుతూ అప్పుతీర్చుకొనే వాణ్ణి. “వారిద్దరకూ స్నేహం” అనే వారు యీ నమస్కారాలు చూచిన పెద్దమనుషులు. ఈ స్నేహం ఎప్పటినుంచో ఈ నమస్కారం ఎందుకో ఆయనకు తెలుసు నాకు తెలుసు; సమాజానికేం తెలుస్తుంది?